

కంటి వెలుగుకు స్పందన

పెద్దపల్లి జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కంటి పరీక్షల్లో రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. 8లో▸



కొత్త గనులు, క్వార్టర్లు ఏమయ్యాయి?

సింగరేణి సంస్థ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆరోపించారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/20.0

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎండ వేడిమి కాస్త తగ్గే అవకాశముంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

చిరుధాన్యాల్లో పోషకాలు



అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

రామగిరి: చిరుధాన్యాల్లోనే పోషకాలు లభిస్తాయని రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు భాస్కరరావు, టి.నవ్యారావు తెలిపారు. రత్నాపూర్ రైతువేదికలో అంతర్జాతీయ చిరుధాన్యాలపై మహిళలకు అవగాహన కల్పించారు. జొన్నలు, సజ్జలు, కొర్రలు, వరిగెలు, రాగుల్లో పోషక విలువలు మెండుగా ఉంటాయన్నారు. పీచుపదార్థం ఎక్కువగా ఉండడం ద్వారా మధుమేహవ్యాధిగ్రస్తులకు చాలా మంచివన్నారు. సర్పంచ్ పల్లె ప్రతిమ, ల్యాబ్ టెక్నీషియన్ వినాయక్, మహిళలు పాల్గొన్నారు.

ఓదెలలో ఆగిన రామగిరి రైలు



ఓదెల రైల్వేస్టేషన్‌లో ఆగిన రామగిరి రైలు వద్ద మాజీ ఎంపీ వివేక్, తదితరులు

ఓదెల: కరోనా సమయం నుంచి ఓదెల రైల్వేస్టేషన్‌లో ఆగకుండా వెళ్తున్న రామగిరి రైలుకు బుధవారం నుంచి హాల్టింగ్ కల్పించారు. రామగిరితోపాటు అజ్నీ ప్యాసింజర్లను ఓదెలలో ఆపాలని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు రైలు ఆగడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు స్థానికులు వివేక్‌కు డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికారు. బాణాసంచా కాల్చి సంబరాలను జరుపుకున్నారు. అనంతరం వివేక్ రైలును ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి, నాయకులు అల్లం సతీష్, తీర్థాల కుమార్, పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, సజ్జత్, దేవిడి రజనీకర్ పాల్గొన్నారు.

కొలనూర్‌లో పలు రైళ్లను ఆపాలని వినతి

కొలనూర్ రైల్వేస్టేషన్‌లో సిర్‌పూర్‌కాగజ్‌నగర్, తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని నాయకులు దేవిడి రజనీకర్‌రెడ్డి, ఆసిఫ్ వివేక్‌కు వినతిపత్రం ఇచ్చారు. కొలనూర్ నుంచి ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల ప్రయాణికులు సిర్‌పూర్‌కాగజ్‌నగర్, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లలో ప్రయాణిస్తారని, రైళ్లు ఆపితే బాగుంటుందని పేర్కొన్నారు.

12నుంచి నూకాంబిక జాతర



మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

రామగుండం: ఈనెల 12 నుంచి 21వరకు నూకాంబిక దేవి జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్లు జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ జమ్ముల రామారావు తెలిపారు. జాతరకు న్యూజిలాండ్, అండమాన్, లండన్, ఢిల్లీ, విజయవాడ, విశాఖపట్టణం తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. నవరాత్రి పూజల్లో భాగంగా తొలిరోజు పుట్ట బంగారం తేవడం, ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన, 14న గాజులతో అలంకరణ, 16న పసుపు కొమ్ములతో అలంకరణ, 17న పుష్పాలంకరణ, 21న విశేష పూజలు ఉంటాయని, అగ్నిగుండ ప్రవేశంతో జాతర ముగుస్తుందని, భక్తులకు అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.







మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

• జిల్లా కేంద్రంలో ఘనంగా మహిళా దినోత్సవం



సీపీ రెమా రాజేశ్వరితో సెల్ఫీలు దిగుతున్న యువతులు

పెద్దపల్లిరూరల్: సృష్టిలో అమ్మకు అత్యున్నత స్థానముందన్నారు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి. జిల్లాకేంద్రంలోని నందన గార్డెన్‌లో సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవాన్ని మహిళా కమిషన్ సభ్యురాలు కటారి రేవతిరావు, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డితో కలిసి ప్రారంభించారు. మహిళలంతా చదువుకోవాలని, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని రేవతిరావు అన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని కుమార్‌దీపక్ అన్నారు. అనంతరం మహిళాసంఘాలకు వడ్డీరాయితీ చెక్కు అందించారు. సఖి కేంద్రం సేవలపై నాటక ప్రదర్శన ఆకట్టుకుంది.

మహిళల్లో ఆత్మస్థైర్యం పెరగాలి: సీపీ

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, డీసీపీ వైభవ్‌గైక్వాడ్, ఏసీపీ ఎడ్ల మహేశ్, ఇతర అధికారులు హాజరయ్యారు. మహిళ రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని సీపీ సూచించారు.



నృత్యాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



మహిళా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు రేవతిరావు, చిత్రంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



నృత్యాలు చేస్తున్న మహిళలు

కమలంలో జోష్ కరువు..!

• గ్రూప్ రాజకీయాల్లో నాయకులు • పాత, కొత్త వారికి పొసగని వైనం
• జిల్లాలో కనిపించని 'ఆకర్ష్' ఆనవాళ్లు • కార్యకర్తల్లో ఉత్సాహం నింపని నేతలు

ఓదెల రైల్వేస్టేషన్‌లో బుధవారం రామగిరి ఎక్స్‌ప్రెస్ రైలు ఆగిన సందర్భంగా మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, గొట్టిముక్కల సురేష్‌రెడ్డి తదితర బీజేపీ నాయకులు కలిసి పార్టీ కార్యక్రమం నిర్వహించారు. అయితే పార్టీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను కార్యక్రమానికి కనీసం ఆహ్వానించలేదని, గ్రూప్ రాజకీయాలు తగవని స్థానిక బీజేపీ శ్రేణులు ప్రెస్‌మీట్లు పెట్టి మరీ వివేక్ వర్గంపై ఫైర్ అయ్యారు. మరికొన్ని నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అన్ని పార్టీలు దూకుడు పెంచగా.. బీజేపీ మాత్రం ఇంకా అంతర్గత కుమ్ములాటలు, గ్రూప్ రాజకీయాలతోనే పోటీపడుతోంది. మరోపక్క బీజేపీలోకి ఇతర జిల్లాల్లో వలసలు జరుగుతున్నా.. జిల్లాలో మాత్రం 'ఆపరేషన్ ఆకర్ష్' భూతద్దం పెట్టి చూసినా కనిపించటం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక బీజేపీ శ్రేణుల్లో నిరుత్సాహం కనిపిస్తోంది.



సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో బీజేపీ పరిస్థితి దయనీయంగా ఉంది. ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా బీజేపీలోకి ఇతర పార్టీల నాయకులు క్యూ కడుతుంటే జిల్లాలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. పార్టీలోకి కొత్తగా చేరిన వారికి, పాతవారికి మధ్య గ్రూప్ రాజకీయాలే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. పాతవారు పనిచేయరు.. కొత్తవారిని పనిచేయనివ్వరు అన్నట్లు పరిస్థితి ఉండటంతో కమలం పార్టీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందని పార్టీ శ్రేణులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తలు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు. నాయకుల మధ్య తీవ్ర సమన్వయం కొరవడటంతోనే పార్టీ సంస్థాగతంగా బలపడడం లేదని పార్టీ కిందస్థాయి శ్రేణులు వాపోతున్నారు.

గ్రూప్ తగాదాలే పార్టీకి శాపం

బీజేపీలో కొత్త, పాత నాయకుల సమన్వయలోపంతోనే జిల్లాలో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోంది. గ్రూపు రాజకీయాలతో పార్టీకి ఈ దుస్థితి వచ్చిందనేది నగ్నసత్యం. ఉన్న కొద్దిపాటి కార్యకర్తల్లో మూడు వర్గాలు, ఆరు గ్రూపులు అన్నట్లు మారింది. పాత తరం నాయకులకు.. గత సార్వత్రిక ఎన్నికల తరువాత కొత్తగా చేరిన వారి మధ్య సమన్వయం లేదు. కొత్తగా చేరిన పలువురు నాయకులు రాష్ట్రస్థాయిలో వారికి ఉన్న పలుకుబడితో పదవులు తెచ్చుకున్నా.. జిల్లాలో నాయకులను కలుపుకొనిపోవడం లేదన్న విమర్శలున్నాయి. పార్టీ అధిష్టానానికి సైతం పెద్దపల్లిలో పార్టీ పరిస్థితిపై సమాచారం ఉన్నా పట్టించుకోకపోవడంతో ఎవరికివారే అన్నట్లు స్థానిక నాయకత్వం వ్యవహరిస్తోంది.

కనిపించని ఆకర్ష్ ఆనవాళ్లు

తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రజా సంగ్రామయాత్ర పేరుతో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కృషి చేస్తున్నారు. కొత్తగా పార్టీలో చేరిన చేరికల కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్‌కు సైతం జిల్లాలో చాలామందితో సత్సంబంధాలున్నాయి. ఈనేపథ్యంలో ఈటల జిల్లాలో చేరికల కోసం మొదట్లో ప్రయత్నాలు చేసినా.. స్థానిక నేతల గ్రూప్ రాజకీయాలతో పార్టీలోకి చేరటానికి ఎవరూ ఆసక్తి చూపించలేదు. జిల్లాలో బీజేపీ పరిస్థితి గొర్రె తోక బెత్తెడు అన్నట్లుందనే విమర్శలున్నాయి. ఇక అన్ని జిల్లాలో కనిపిస్తున్న ఆపరేషన్ ఆకర్ష్ జిల్లాలో మచ్చుకు కూడా కనిపించడం లేదు.

పార్టీ కార్యక్రమాలూ మొక్కుబడిగా..

బీజేపీ కేంద్ర నాయకత్వం తెలంగాణ మీద ప్రత్యేకంగా ఫోకస్ పెట్టి రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపడతోంది. ఇందులో భాగంగా ఇటీవల నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ సైతం మొక్కుబడిగా నిర్వహించారు. మిగిలిన పార్టీల నాయకులు ముమ్మరంగా ప్రచారం చేస్తూ ఎన్నికల పోరులో దూసుకెళ్తుంటే.. కమలనాథులు మాత్రం ఉలుకుపలుకు చేయడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు.అధిష్టానం జిల్లా బీజేపీపై దృష్టిసారించి పార్టీని గాడిన పెట్టాలని కార్యకర్తలు కోరుకుంటున్నారు.

కడుపు కోతలు వద్దు



కరీంనగర్ ఆసుపత్రిలో ఆరోగ్య మహిళ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్

• తల్లులకు మంత్రి హరీష్‌రావు విజ్ఞప్తి
• గర్భసంచుల తొలగింపుపై ఆందోళన
• కరీంనగర్‌లో ఆరోగ్య మహిళ పథకం ప్రారంభం
• ఆడబిడ్డల కళ్లలో ఆనందం కోసం అద్భుత పథకం
• రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్‌టౌన్: ముహూర్తాల పేరుతో సిజేరియన్లు చేయిస్తే అటు తల్లికి, ఇటు బిడ్డకు నష్టాన్ని చేకూరుస్తుందని తల్లులకు వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లో అత్యధికంగా జరుగుతున్న సిజేరియన్లపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న కాన్పుల్లో 90 శాతం సిజేరియన్లే చేస్తున్నారని, తల్లి ఆరోగ్యం దెబ్బతిని భవిష్యత్తులో గర్భసంచి తొలగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన చెందారు. వీటన్నింటిని అధిగమించేందుకే మహిళా దినోత్సవ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' పథకాన్ని ప్రకటించిందన్నారు. దీనిని కరీంనగర్‌లో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 50 అదనపు పడకలు, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో 100 అదనపు పడకలను, తెలంగాణ డయాగ్నోస్టిక్ అనుబంధ రెడియాలజీ హబ్‌ను ప్రారంభించారు. క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు.

పేద మహిళల కోసమే ఆరోగ్య పథకం

మార్క్‌ఫెడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి మహిళలు తాము పడుతున్న ఆరోగ్య సమస్యలు భర్తలకు, బయటకు చెప్పుకోవడానికి బిడియ పడుతుంటారని, కొందరు ఆర్థిక ఇబ్బందులు, మరికొందరు ఆస్పత్రిలో మగ డాక్టర్లకు సమస్యలు చెప్పుకోలేక హాస్పిటల్‌కు వెళ్లడమే మానేశారని అన్నారు. ఇలాంటి వారికోసమే ఆరోగ్య మహిళ పథకం ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. మహిళలు సాధారణంగా ఎదుర్కొనే ఎనిమిది రకాల సమస్యలకు వైద్య సేవలు, 57 రకాల పరీక్షలు చేస్తామని అన్నారు. సర్జరీలు, ఇతర అడ్వాన్సుడ్ వైద్య పరీక్షల కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేశామని, జిల్లా ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ స్కాన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఆడబిడ్డ కళ్లలో ఆనందం చూడాలని..

మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఆడబిడ్డ కళ్లల్లో ఆనందం చూడాలని ఆరోగ్య మహిళ పథకం చేపట్టిన ఘనత సీఎం కేసీఆర్‌ది అన్నారు. ఏ దేశంలో కూడా అమలు చేయని గొప్ప పథకం ఇది అని కొనియాడారు. ఈ ఒక్కరోజు కాదు ప్రతిరోజు మహిళా దినోత్సవం కావాలని ఆకాంక్షించారు.

మహిళా అధికారులకు సన్మానం..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ శ్వేతా మహంతి, అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, డీఎంహెచ్‌వో డాక్టర్ జవేరియా, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్న మాల, డీఆర్‌డీవో శ్రీలత, డీసీవో శ్రీమాల, డీఎంవో పద్మావతి, రిసోర్స్ పర్సన్స్‌లను చీరసారెతో ఘనంగా సన్మానించారు. మేయర్ సునీల్‌రావు, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, సీపీ సుబ్బరాయుడు, అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్, అసిస్టెంట్ కలెక్టర్ లెనిన్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి పైప్‌లైన్ మరమ్మతు పూర్తి

• వేంనూరులో ప్రారంభమైన ఎత్తిపోతలు
• నేటినుంచి మేడారం పంప్‌హౌస్ షురూ



ధర్మారం: మండలంలోని నందిమేడారం పంప్‌హౌస్ మరమ్మతు పనులు బుధవారం పూర్తయ్యాయి. దీంతో రామగుండం మండలం వేంనూర్ పంప్‌హౌస్ నుంచి మేడారం రిజర్వాయర్‌లోకి ఎల్లంపల్లి నీటి ఎత్తిపోతలను ప్రారంభించారు. గురువారం ఉదయం మేడారం పంప్‌హౌస్ నుంచి ఒక మోటార్‌తో ఎత్తిపోతలు షురూ చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. గత నెల 28న మేడారంలోని ఎల్లంపల్లి పంప్‌హౌస్‌లోని ఒక మోటార్‌ను ఆన్‌చేసి నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయించారు. నాలుగు గంటల్లోనే పంప్‌హౌస్ సమీపంలోని బటర్‌వాల్వ్‌లోని బైపాస్ వాటర్ పైప్ పగిలిపోయింది. ఎనిమిది రోజులుగా ఇంజినీరింగ్ అధికారులు, ఎల్లంపల్లి పైప్‌లైన్ ఏజెన్సీ వారు మరమ్మతు పనులు చేపట్టి పూర్తి చేశారు. పంప్‌హౌస్‌లోకి చేరిన నీటిని రెండురోజులు తొలగించారు. సిల్ట్ తొలగించి నీటిలో మునిగిపోయిన కూలింగ్ పంప్‌లను బయటకు తీసి శుభ్రం చేసి మళ్లీ బిగించి వేంనూర్ వద్ద ఒక పంప్‌ను ప్రారంభించారు. మేడారం పంప్‌హౌజ్‌లో నాలుగు మోటార్లు ఉండగా ప్రస్తుతం రైతులకు సాగు నీరందించే ప్రయత్నంలో ఒక మోటార్‌నే సిద్ధం చేశారు.

'ఆరోగ్య మహిళ' ప్రారంభం

మంథని: పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించే దిశగా సీఎం కేసీఆర్ ముందుకుసాగుతున్నారని, ఇందులో భాగంగానే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని తీసుకొచ్చారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. బుధవారం మండలంలోని గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. చాలామంది ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడుతున్నారని, అలాంటివారు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రి వైద్యురాలు శంకరాదేవి, ఎంపీపీ కొండ శంకర్, జడ్పీటీసీ తగరం సుమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి పాల్గొన్నారు.

వారానికో రోజు ప్రత్యేక వైద్య పరీక్షలు

పెద్దపల్లిరూరల్: మహిళల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని తెచ్చిందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు.



ఆరోగ్య మహిళాకార్డు అందిస్తున్న జెడ్పీ చైర్మన్

చీకురాయి క్రాస్‌రోడ్ సమీపంలో ఆరోగ్య మహిళ కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ప్రతి మంగళవారం మహిళలకు పూర్తిస్థాయి ఆరోగ్యపరీక్షలు చేస్తారని, చికిత్స అవసరమని గుర్తిస్తే పైఆసుపత్రులకు రెఫర్ చేస్తారని వివరించారు. రాష్ట్ర నోడల్ అధికారి తిరుపతి, పురుషోత్తం, సుధాకర్‌రెడ్డి, మహేందర్, స్వప్న, రాజేందర్, వెంకటేశ్వర్లు, రాజేశం తదితరులున్నారు.

ఎన్టీపీసీ సంస్కృతి, సంప్రదాయాల నిలయం

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తోందని, ఇక్కడ అన్ని రాష్ట్రాల వారు విధులు నిర్వర్తిస్తుండడంతో ప్రతి పండుగనూ ఘనంగా జరుపుకుంటున్నామని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్ అన్నారు. బుధవారం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అందరూ కలిసి రంగులు చల్లుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్, అధికారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



హోలీ వేడుకల్లో ఎన్టీపీసీ ఈడీ సునిల్‌కుమార్

క్లుప్తంగా

కడుపునొప్పి భరించలేక గర్భిణి ఆత్మహత్య

- మృతురాలు అడ్వకేట్
- మహిళా దినోత్సవం రోజు గంగానగర్‌లో విషాదం


పుష్పలత (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): మహిళా దినోత్సవం రోజు ఓ గర్భిణి ఆత్మహత్య చేసుకోవడం గోదావరిఖని గంగానగర్‌లో విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. గంగానగర్‌కు చెందిన బరిగెల పుష్పలత(33) భర్త, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఆమె ప్రస్తుతం 4 నెలల గర్భిణి. కొన్నేళ్లుగా అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తోంది. ఈ క్రమంలో కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులకు వెళ్లి, చికిత్స పొందినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. మృతురాలి తల్లి ఆశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి పేర్కొన్నారు.

మక్కాన్‌సింగ్‌కు పలువురి పరామర్శ


నివాళి అర్పిస్తున్న వేణుగోపాల్‌రావు

రామగుండం: ఇటీవల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సోదరుడు శైలేందర్‌సింగ్ హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం పట్టణంలోని మక్కాన్‌సింగ్ నివాసానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు హర్కర వేణుగోపాల్‌రావు, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు మక్కాన్‌సింగ్‌తో పాటు మరో సోదరుడు అయోధ్యసింగ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

2018 నాటి కేసులో 25 మందికి జరిమానా

మంథని: 144 సెక్షన్ అమలులో ఉండగా ధర్నా నిర్వహించి, ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించిన కేసులో బుధవారం మంథని కోర్టు న్యాయమూర్తి 25 మందికి రూ.1,000 చొప్పున జరిమానా విధించారని పోలీసులు తెలిపారు. 2018 మార్చి 13న మంథని అంబేడ్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన 27 మందిపై కేసు నమోదైందని పేర్కొన్నారు. వీరిలో ఇద్దరు మృతిచెందగా మిగతా 25 మందిని కోర్టులో హాజరుపరిచామన్నారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని తెలిపారు.

ఇద్దరికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర, ఓ వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరు గ్రామానికి చెందిన ఆరెల్లి స్వరూప బుధవారం ఆటోలో పోతన కాలనీ నుంచి అల్లూరుకు వస్తోంది. పోతన కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డులో గల పెట్రోల్ బంక్ సమీపంలో దిగింది. గ్రామానికి వెళ్లేందుకు నడుచుకుంటూ రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో మద్యం మత్తులో కాలనీ వైపు నుంచి ద్విచక్రవాహనదారుడు అతివేగంగా వస్తున్నాడు. ఆ బైక్‌ను తప్పించే క్రమంలో వెనక నుంచి వస్తున్న ఆటో స్వరూపను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తల, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనాదారుడు కూడా కింద పడటంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. ఆటోతోపాటు ద్విచక్రవాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కంటి వెలుగు శిబిరాలకు స్పందన


కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ధర్మారం ఎంపీపీ కరుణశ్రీ (ఫైల్)

- విజయవంతంగా కొనసాగుతున్న కార్యక్రమం
- 18 పీహెచ్‌సీలు, 6 అర్బన్ హెల్త్ సెంటర్లలో 34 బృందాలు
- జిల్లాకు రాష్ట్రంలోనే మూడో స్థానం

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కంటి పరీక్షల్లో రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, మందులు, కళ్లద్దాలను పంపిణీ చేస్తుండటంతో స్పందన లభిస్తోంది. కలెక్టర్ సంగీత ఆధ్వర్యంలో జిల్లా వైద్యశాఖ అధికారులు కంటివెలుగు శిబిరాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. గత జనవరి 19న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 18 పీహెచ్‌సీలు 6 అర్బన్ హెల్త్ సెంటర్లలో 34 బృందాలను ఏర్పాటు చేసి, శిబిరాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నారు. మొత్తం టీంలలో 23 గ్రామీణ ప్రాంతాల్లో, 11 అర్బన్ ఏరియాల్లో పని చేస్తున్నాయి.

100 రోజులు.. 387 శిబిరాలు

100 రోజుల్లో జిల్లావ్యాప్తంగా 387 శిబిరాలను ఏర్పాటు చేసి, ప్రజలకు కంటి పరీక్షలు చేయనున్నారు. ఈ నెల 3 వరకు 43 రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 1,53,238 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో దగ్గరి చూపు లోపం ఉన్నవారు 53,036 మందిని గుర్తించి, కళ్లద్దాలు అందించారు. దూరపు చూపు లోపం ఉన్నవారు 20,716 మందిని గుర్తించి, కొంతమందికి అద్దాలు పంపిణీ చేయగా మరికొందరికి ఇవ్వాల్సి ఉంది. 79,496 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని వైద్యులు తేల్చారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతీ గ్రామంలో కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి, కళ్లద్దాలు అందిస్తామని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. గ్రామంలో కంటివెలుగు శిబిరం నిర్వహించిన రోజు అందుబాటులో లేనివారికి ఇతర గ్రామాల్లో జరిగే శిబిరాల్లో పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛందంగా వస్తున్నారు..



కంటివెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, క్యూ పద్ధతిలో పరీక్షలు చేయించుకుంటున్నారు. ధర్మారం మండలంలో ఇప్పటివరకు 12,683 మందికి కంటి పరీక్షలు నిర్వహించాం. వీరిలో 1,993 మందికి దగ్గరి చూపు సమస్య ఉందని గుర్తించి, అద్దాలు ఇచ్చాం. మరో 1,230 మందికి ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు ఇస్తాం.

– నార్ల అనుదీప్, మేడారం పీహెచ్‌సీ వైద్యాధికారి

మహిళలతోనే మానవ ప్రగతి


విజేతలకు బహుమతి అందిస్తున్న శ్రీదేవి

రామగిరి(మంథని): మహిళలతోనే మానవ ప్రగతి సాధ్యమని ఆర్జీ–3, ఏపీఏ ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు తన్నీరు శ్రీదేవి అన్నారు. సెంటినరీకాలనీలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఆకాశంలో సగం అంటూ ఆకాశానికెత్తేస్తారు కానీ వాస్తవంలో మహిళ పురోగమించవలసిన విషయాలెన్నో ఉన్నాయని పేర్కొన్నారు. మహిళల పరిస్థితి గతంలో కంటే చాలా మెరుగుపడిందని, ఇంకా సంపూర్ణ స్వేచ్ఛ వారికి లేదని ఆయన తెలిపారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సెంటినరీకాలనీలోని సింగరేణి డిస్పెన్సరీలో బీఎంఎస్ ఆధ్వర్యంలోని నిర్వహించిన వేడుకల్లో సంఘం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు అరుకాల ప్రసాద్‌లు మహిళా ఉద్యోగులను శాలువాలతో సన్మానించారు. కొప్పుల విజయ, ప్రగతి విద్యాసంస్థల అధినేత మిర్యాల నాగరాజకుమారి, ప్రొఫెసర్ సుమతి, టీబీజీకేఎస్ ప్రతినిధి కంది రమ్య, విద్యార్థినులు, సేవా, కార్మిక కుటుంబ సభ్యులు, లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మాకూ ‘గుర్తింపు’ కావాలి..!


సింగరేణి కాంట్రాక్టు కార్మికులు

- సింగరేణి కాంట్రాక్టు కార్మికుల డిమాండ్
- సంస్థ వ్యాప్తంగా 25 వేల మంది
- సమస్యల పరిష్కారానికి ఏళ్ల తరబడి నిరీక్షణ

గోదావరిఖని: సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు గుర్తింపు యూనియన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. ఏళ్ల తరబడి ఆందోళనలు చేసినా సమస్యల పరిష్కారం కావడం లేదని, తమ కోసం చర్చించే యూనియన్ కోసం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. సంస్థ విస్తరించిన ఆరు జిల్లాల్లో సుమారు 25వేలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు. భూగర్భగనుల్లో మొదలు సివిక్, సివిల్, బెల్ట్‌క్లీనింగ్, ఓబీ ఇలా పలు విభాగాల్లో కాంట్రాక్టు కార్మికుల పనితీరు యాజమాన్యానికి కీలకంగా మారింది. గతంలో కన్నా కాంట్రాక్టు కార్మికుల సంఖ్య భారీగా పెరిగింది. సంస్థ వ్యాప్తంగా పర్మినెంట్ ఉద్యోగులు 42వేల మంది ఉండగా.. కాంట్రాక్టు కార్మికులు 25వేలకు పైగా పనిచేస్తున్నారు. దీంతో సంస్థలో సమస్యలు తలెత్తినప్పుడు స్పందించే కార్మిక సంఘాలు లేవని వాపోతున్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న తమకు వేతనాలతోపాటు కనీస సౌకర్యాల కల్పనలో కూడా అన్యాయం జరుగుతోందని పేర్కొంటున్నారు. సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి చర్చించేందుకు కాంట్రాక్టు గుర్తింపు యూనియన్ ఉండాల్సిందేనని పట్టుబట్టారు.

పట్టించుకోని యాజమాన్యం

పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని వాపోతున్నారు. పర్మినెంట్ కార్మికులకు సమస్యలు తలెత్తితే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు రంగంలోకి దిగి యాజమాన్యంతో చర్చించి చట్టబద్ధంగా హక్కులు కల్పిస్తున్నాయన్నారు. ఈక్రమంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించి చట్టబద్ధత కల్పించేందుకు ఎన్నికలు అవసరమనే డిమాండ్ సింగరేణిలో పెరుగుతోంది. కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో నిర్వహిస్తున్న విధంగా సింగరేణిలోనూ గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి.

కొత్త గనులు, క్వార్టర్లు ఏమయ్యాయి?

- సింగరేణి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోంది
- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆరోపించారు. బుధవారం ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–2ఏ గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులు తమ ప్రాణాలను పణంగాపెట్టి, సంస్థను లాభాల్లోకి తీసుకువస్తే ఆ సొమ్మునంతా సర్కారు దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. ఫలితంగా కొత్త బొగ్గు గనులు ఈ ప్రాంతానికి రావడం లేదని, దీంతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణికి రావాల్సిన రూ.వంద కోట్లు మాఫీ చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. మారు పేర్ల మార్పు, కొత్త బొగ్గు గనుల ఏర్పాటు, నూతన రిక్రూట్‌మెంట్, పది వేల నూతన క్వార్టర్ల నిర్మాణం ఎటు పోయాయని ప్రశ్నించారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికుల పక్షాన పోరాడే ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. నాయకులు నర్సింహారెడ్డి, సదానందం, ధర్మపురి, వంగ లక్ష్మీపతిగౌడ్, వికాస్‌కుమార్ యాదవ్, ఆరెపల్లి శ్రీనివాస్ తదితరులున్నారు.

కార్మిక సంక్షేమమే టీబీజీకేఎస్ ధ్యేయం


కార్మికులతో మాట్లాడుతున్న శంకరయ్య

రామగిరి(మంథని): సింగరేణి కార్మికుల సంక్షేమమే గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ ధ్యేయమని ఆ సంఘం ఆర్జీ–3, ఏపీఏ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య అన్నారు. ఏపీఏ పరిధిలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు(ఏఎల్పీ)లో గని పిట్ సెక్రటరీ దాసరి మల్లేశ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గని కార్మికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారం కోసం యాజమాన్యంతో మాట్లాడతామని పేర్కొన్నారు. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొంది, విధుల్లో చేరిన బదిలీ వర్కర్లను కలిశారు. టీబీజీకేఎస్ చేపడుతున్న కార్మిక సంక్షేమ పథకాలను వారికి వివరించారు. డ్యూటీ సరిగా చేసుకుంటూ కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, శ్రీను, శేఖర్, రమేశ్, సతీశ్‌రెడ్డి, క్రాంతి యాదవ్, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎక్కడికక్కడే వాటిపై ప్రచారం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేశ్ రెడ్డి ఆరోపించారు. బుధవారం సుల్తానాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత ప్రతినిధి పిళ్లైని ఈడీ అరెస్టు చేసిందని, త్వరలో కవితను సైతం అరెస్టు చేయనుందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని అన్నారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రుణ మాఫీ చేశామని చెప్పారు. ఈనెల 10న ఎలిగేడు మండలం సుల్తానాపూర్‌కు ఏఐసీసీ నేతలు ధరణి పోర్టల్‌పై రైతుల బాధలు తెలుసుకునేందుకు వస్తున్నట్లు విజయ రమణారావు తెలిపారు. రాష్ట్రంలో సుల్తానాపూర్‌ను పైలెట్ ప్రాజెక్టుగా కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిందని.. ఏఐసీసీ దూతలుగా జై రామ్ రమేశ్, కొప్పు రాజు, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీధర్ బాబు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయ రమణారావు, జిల్లా కార్యదర్శి మినుపాల ప్రకాశ్ రావు, మాజీ సర్పంచుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేయండి’



గోదావరిఖని(రామగుండం): మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేయాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటలపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. సేవా అధ్యక్షురాలు సవిత, సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



గోదావరిఖని(రామగుండం): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ అన్నారు. బుధవారం గోదావరిఖనిలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు కె.పద్మ, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్ రావు, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, లేడీస్ క్లబ్ మెంబర్లు బినాసింగ్, నీరజ, సీనియర్ పీవో సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు ఓటుహక్కు కల్పించాలి



గోదావరిఖని(రామగుండం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికులకు ఓటుహక్కు కల్పించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఓటు వేసే అవకాశం ఇవ్వాలన్నారు. ఈ నెల 13న నిర్వహించే ఎన్నికల సమావేశానికి కాంట్రాక్టు కార్మిక సంఘాలను కూడా అహ్వానించాలని విన్నవించారు.

అభివృద్ధి పథంలో మహిళలు..



జ్యోతినగర్(రామగుండం): మహిళలు అడ్డంకులను అధిగమిస్తూ అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని ఎన్టీపీసీ ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ ప్రజేంజిత్ పాల్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ×ఎంబ్రేస్ ఈక్విటీ× సదస్సులో మాట్లాడారు. మహిళలు ఆదరణకు మించి అవకాశాల కోసం వెతుకుతున్నారని తెలిపారు. మహిళా ఉద్యోగులు సంస్థ, సమాజం నుంచి తమ అనుభవాలు, అంచనాలు, వారి ఆలోచనలను వెల్లడించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు అతుల్ కుమార్ దేశాయ్, పుష్పేంద్రకుమార్ లాధ్, ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో గ్రూపులను సహించబోం

- పీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు


మాట్లాడుతున్న విజయరమణారావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): కాంగ్రెస్ పార్టీలో గ్రూపులు చేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. బుధవారం సుల్తానాబాద్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి పెద్దపల్లి బహిరంగ సభ ఇన్‌చార్జి పటేల్ రమేశ్ రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇసుక, మట్టి మాఫియా నడిపిస్తున్న చరిత్ర ఎవరిదో ప్రజలందరికీ తెలుసని, రానున్న రోజుల్లో బుద్ధి చెప్తారని అన్నారు. మరో 7 నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయని, గ్రామగ్రామాన బూత్ స్థాయి నుంచి సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉండాలని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని ఆరోపించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ 45 స్థానాల్లో గెలుస్తుందని, అందులో పెద్దపల్లి సైతం ఉందని చెప్పారు. గురువారం కరీంనగర్‌లో నిర్వహించే బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి 7 వేల మందిని తరలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్య గౌడ్, పార్టీ జిల్లా కార్యదర్శి ప్రకాశ్ రావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్‌రావు, మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చందనాపూర్ ఎస్సీ కాలనీవాసుల ధర్నా

- ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయింపు
- పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వాలని డిమాండ్


ఆర్డీవో వీరబ్రహ్మాచారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం)/మంథని: తమకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని సింగరేణి ప్రభావిత గ్రామం రామగిరి మండలంలోని చందనాపూర్ ఎస్సీ కాలనీవాసులు బుధవారం మంథని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. 2008లో సింగరేణి ఓసీపీ విస్తరణ కింద తమ గ్రామాన్ని తీసుకొని, ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించలేదని అన్నారు. ఇప్పుడు వచ్చి, ఇళ్లను ఖాళీ చేయాలని హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయంలో తప్పిపోయిన పేర్లను పరిశీలించి, వారిని తిరిగి జాబితాలో చేర్చాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలన్నారు. గ్రామాన్ని సందర్శించి, తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం ఆర్డీవో వీరబ్రహ్మాచారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచు దాసరి శంకరయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఓదెలు, ఉపసర్పంచు శ్రీనివాస్, గ్రామస్తులు చంద్రయ్య, రాజు, సంగీత, సంతోష్, సునీత, రాజేశ్వరి, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాట్యరత్న అవార్డుకు ఎంపిక


రవికుమార్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): నాట్యరత్న నేషనల్ అవార్డు–2023కి యైటింక్లయిన్‌కాలనీకి చెందిన నాట్య గురువు తడబోయిన రవికుమార్ ఎంపికైనట్లు జాతీయ అవార్డు సెలెక్షన్ కమిటీ చైర్మన్, బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఆయనకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బహుజన అకాడమీ వారు ఏటా ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు ఈ అవార్డు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా రవికుమార్‌కు అవార్డు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం.గౌతమ్, కో–ఆర్డినేటర్ విష్ణు, అవార్డు సెలెక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

రామగిరి(మంథని): సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని, మోసం చేసిన వ్యక్తికి మంథని మేజిస్ట్రేట్ శ్రీధర్ రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించినట్లు ముత్తారం ఎస్సై బేతి రాములు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. 2015లో ముత్తారం మండల కేంద్రానికి పింగిలి సురేందర్ రెడ్డికి సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తానని మందమర్రి మండలంలోని రామకృష్ణాపూర్‌కు చెందిన ఆల్ఫ్రెండ్ జయరాజ్ నుంచి రూ.7.20 లక్షలు తీసుకున్నాడు. తర్వాత కొలువు పెట్టించలేదు. తీసుకున్న డబ్బులైనా ఇవ్వాలని అడిగితే ఇవ్వడం లేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన సురేందర్‌రెడ్డి ఆల్ఫ్రెడ్ జయరాజ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి, సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జయరాజ్‌కు శిక్ష ఖరారు చేస్తూ బుధవారం తీర్పు వెల్లడించారని ఎస్సై పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో మహిళా పేషెంట్‌కు తీవ్ర గాయాలు

- ఆసుపత్రి రెండో అంతస్తు పైనుంచి పడటంతో ఘటన
- కరీంనగర్ తరలించిన వైద్యులు


బాధితురాలికి ప్రథమ చికిత్స అందిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్) రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు ఓ మహిళా పేషెంట్ కింద పడింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖనిలోని ఎల్బీనగర్‌కు చెందిన పైడిపెల్లి సరోజన జ్వరం, ఫిట్స్ తదితర అనారోగ్య సమస్యలతో మంగళవారం దవాఖానాకు వచ్చింది. వైద్యులు పరీక్షించి, ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకున్నారు. ఆమెకు తోడుగా భర్త రవీందర్ ఉన్నాడు. ఆసుపత్రి రెండో అంతస్తులోని వార్డులో ఉన్న సరోజన బుధవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో బాత్‌రూంకు వెళ్లడానికి మెట్ల వద్దకు వచ్చింది. అకస్మాత్తుగా అక్కడి నుంచి కింద పడింది. పెద్ద శబ్దం రావడంతో ఉలిక్కిపడిన ఆమె భర్త, వైద్య సిబ్బంది వెంటనే వెళ్లి చూశారు. తీవ్రంగా గాయపడిన సరోజనను ఎమర్జెన్సీ వార్డుకు తరలించి, ప్రథమ చికిత్స అందించారు. తలకు కుట్లు వేసిన అనంతరం బాధితురాలిని వైద్యులు కరీంనగర్‌లోని చల్మెడ ఆసుపత్రికి తరలించారు. ఆమె రెండో అంతస్తు నుంచి ఎలా పడిందో ఎవరూ సరిగా చెప్పలేకపోతున్నారు. ఈ సంఘటనతో ఇన్‌పేషెంట్లు ఆందోళనకు గురయ్యారు.